# గడప దాటి.....

"ఎక్కడికి వెళ్తున్నారు?" నందినీ శ్రీవాత్సవ భర్తని అడిగింది.

"అడిగావూ? ఇంక వెళ్ళేపని అయనట్టే!?" శ్రీవాత్సవ అన్నాడు చొక్కా గుండీలు పెట్టుకుంటూ.

"ఆఫీసుటైమయిఉంటే అడిగేదాన్ని కాను. ఎనిమిది గంటలకే వెడ్తోంటే అడిగాను. ఏదైనా ఫోను వస్తే ఏం చెప్పమన్నారు?" నందిని నొచ్చుకుంటూ అడిగింది.

"ఎప్పుడు, ఎవరు ఫోన్ చేసినా ఆఫీసు పనిమీద ఎక్కడికో వెళ్ళారని చెప్పు!" అంటూ శ్రీవాత్సవ బ్రీఫ్‌కేస్ తీసుకొని, బయటకువెళ్ళి ఆఫీసు కారులో కూర్చున్నాడు.

❁ ❁ ❁

ఉదయం పదకొండున్నర ప్రాంతాన, జనరల్ మేనేజర్ సేన్‌గుప్తా తన ఛాంబర్‌లో నలుగురైదుగురు సెక్షనల్‌హెడ్స్‌తో ఏదో విషయమై చర్చిస్తూ ఉండగా శ్రీవాత్సవ -


"మే ఐ కమిన్?" అంటూ దూకుడుగా ప్రవేశించాడు. విసురుగా ఓకుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

"ఏదో చాలా ఉద్రేకంలో ఉన్నట్టున్నారు, ఏమిటి సంగతి?" సేన్‌గుప్తా చిరునవ్వు నవ్వుతూ ప్రశ్నించాడు.

"సెక్యూరిటీగార్డు అయిడెంటిటీ కార్డు అడిగాడు. ఇన్నేళ్ళు సర్వీసు చేసి, ఇంతబ్రతుకూ బ్రతికి, ఐ.డి. కార్డు అడిగించుకోవడం అవమానంకాని, హారతి పట్టించుకోవడం కాదు! ఎందుకని అడిగితే ఆర్డర్సన్నాడు. ఇటువంటి ఉత్తర్వులు జారీ చేసేముందు, మాకు తెలియజేస్తే కాస్త గౌరవంగా ఉండేది?!" శ్రీవాత్సవ ఉద్రేకంగా అన్నాడు.

"చెప్పకుండా చేశారని చిందులు తొక్కేబదులు, అసలు ఆర్డర్సు ఎందుకివ్వాల్సి వచ్చిందో కారణం అడిగివుంటే మరికాస్త గౌరవంగా ఉండేది!

"మన ప్లాంట్‌కి ఉగ్రవాదులు హాని తలబెట్టారన్న రహస్య సమాచారం అందిందనీ, అందుచేత తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందనీ, నిన్న మధ్యాహ్నం మన రీజియనల్



డైరెక్టర్‌కి, ఛైర్మన్ ఢిల్లీనుంచి ఫోన్ చేశాడు. ఆర్.డి. నాకు ఫోన్‌చేసి ఈ విషయం చెప్పిన వెంటనే, నిన్న మధ్యాహ్నం మూడున్నరికి అందరు డిప్యూటీ జనరల్ మేనేజర్లనీ నాగదికి పిలిచి, తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని గురించి చెప్పాను. మీరూ, బినయ్‌బోసూ లేరు. ఎక్కడికి వెళ్ళారని అడిగితే తెలియదన్నారు మీస్టెనోలు.

"అసలు నిజానికివస్తే, ఈ ఆర్డర్లతో ప్రమేయం లేకుండానే అయిడెంటిటీ కార్డులని అడిగే హక్కు సెక్యూరిటీ వాళ్ళకుంది. ఎంతటి సీనియర్ పొజిషన్‌లో ఉన్నా చూపించే బాధ్యత మనకీ ఉంది. ఏమంటారు?" అన్నాడు సేన్‌గుప్తా.

శ్రీవాత్సవకి సేన్‌గుప్తా సమాధానం, చిరిగిన ఆకులో పంచదార పరమాన్నం పోస్లినట్లనిపించింది.

"శామ్సన్ ఇంజనీరింగ్ కంపెనీ వాళ్ళు, మనం ఇచ్చిన మోడల్ డ్రాయింగ్స్‌లో ఏవో లోపాలున్నాయని ఫోను చేస్తే వెళ్ళాను కాని, ఊరికే ఆఫీసు వదలి వెళ్ళడం నాకూ సరదా కాదు" అన్నాడు శ్రీవాత్సవ ఉక్రోషంగా.

"నేను ఫోను చేసినప్పుడు మీరు గదిలో లేరన్నానేకాని, చెప్పకుండా ఎందుకు వెళ్ళారని అడగలేదుకదా?!" సేన్‌గుప్తా చిన్నచురక అంటించాడు.

"మాకూ మా బాధ్యతలు తెలుసు. అయనా ప్రతిచిన్నవిషయాన్నీ మీ దృష్టికి తీసుకువస్తే

మీకూ చికాకుగా ఉంటుంది" అన్నాడు శ్రీవాత్సవ.

"మీరన్నది నిజమే కావచ్చు. మీ కదలికల్ని గురించి మీ తరువాత వారికి కాని, లేదా మీ పి.ఏ. కి గాని తెలియజేస్తే, చికాకుపడే అధికారం వాళ్ళకి లేదు కదా?!.. సరే, ఇంక ఈవిషయం గురించి ప్రస్తావన ముగిస్తే మంచిది. అసలింతకీ చెప్పవచ్చేదేమిటంటే ఈ ఉదయం వచ్చిన ఆ ఆరు పార్లమెంటు ప్రశ్నలకీ, సాయంకాలంలోపుగా ఆర్.డి.కి డ్రాఫ్టు సమాధానాలు పంపాలి. మీరు మూడింటికల్లా సమాధానాలు రాసి తీసుకురండి. వాటిని నేను కూడా చూసి, ఆర్.డి.కి పంపిస్తాను. అన్నట్టు శ్రీవాత్సవగారూ, మీ విభాగానికీ చెందిన ఓ ప్రశ్న ఉంది. పాత రిపోర్టులు కాస్త రిఫర్‌చేసి, సమాధానం డ్రాఫ్టు చెయ్యండి" అన్నాడు, తన ముందున్న ఫాక్స్ మెస్సేజీల్లో ఒకదాన్ని శ్రీవాత్సవ ముందుకు తోస్తూ.

సేన్‌గుప్తా మాటల్లో 'మీరీ ఉదయం కూడా ఆఫీసుకి ఆలస్యంగా వచ్చా'రన్న ఎత్తిపొడుపు స్ఫురించింది శ్రీవాత్సవకి.

"శామ్సన్ ఇంజనీరింగ్ కంపెనీ వాళ్ళకిచ్చిన డ్రాయింగ్‌లో కొన్ని లోపాలున్నాయి. మనం వాటిని సరిదిద్దకపోతే మొదటికే మోసం వస్తుంది" నలుగురైదుగుర్ని ఆ పనిమీద ఉంచాను. మధ్యాహ్నం మన ఆఫీసర్లతోబాటు అక్కడికివెళ్ళి, కొన్ని సబ్‌సెక్షన్లు చూపించే ప్రయత్నంలో ఉన్నాను. ఈ పార్లమెంటు ప్రశ్నకి సమాధానం తయారుచేసే తీరుబడి నాకు లేదు!" – శ్రీవాత్సవ ఆ రోజు ఏ విధంగానైనా సేన్‌గుప్తా మాట వినకూడదన్న నిశ్చయంతో అన్నాడు.

"సరే, నీ 'నెక్స్ట్ ఇన్ కమాండ్' బాలక్రిష్ణన్ కివ్వు"

"అతను ఈ ఉదయమే మద్రాసు టూర్ మీద వెళ్ళాడు"

"అరె, నాతో చెప్పవలసిందే?"

"టూర్ మీద ఎవర్నైనా పంపే అధికారం నాకుంది!" శ్రీవాత్సవ మిగిలినవారి ముందు జి.ఎమ్. సేన్‌గుప్తా మీద తన ధికారాన్ని చూపించడానికి ప్రయత్నించాడు.

"అధికారం లేదని కాదు. మద్రాసు ఆఫీసులో మూలుగుతున్న వ్యవహారాన్ని ఓ కొలిక్కి తీసుకురావడానికి ఎవర్నైనా పంపితే బావుంటుందని, రెండు రోజులక్రితం నందకిశోర్ అన్నాడు. బాలక్రిష్ణన్ వెళ్తున్న సంగతి నాకు తెలుసుంటే, ఈ విషయమై కూడా కాస్త చూడమని చెప్పేవాణ్ణి"

"అతనికి అవసరముంటే అతనే ఎవర్నో పంపి ఉండవల్సింది"

సేన్‌గుప్తా శ్రీవాత్సవ ముఖంలోకి చూస్తూ అన్నాడు.

"ఎవరిమట్టుకు వాళ్ళు తమ అధికారాల్ని వినియోగించుకోవడంలో తప్పులేదని అనుకోవచ్చును. కాదనను. కాని ప్రభుత్వం సొమ్ము దుబారా కాకుండా చూడవలసిన బాధ్యతా, అధికారమూ కూడా ఈ కుర్చీకున్నాయి"

శ్రీవాత్సవ ఏదో అనబోయేలోగా, సేన్‌గుప్తా ఇంటర్‌కామ్‌లో, స్టెనోని రమ్మని పిలిచాడు.

వెనక తలుపు తెరుచుకుని డిక్టేషన్ పాడ్‌తో, స్టెనో వచ్చాడు. సేన్‌గుప్తా వెంటనే డిక్టేట్ చేశాడు.

"ఎవర్నైనా ఆఫీసు పని మీద పైఊళ్ళకి టూరు మీద పంపేముందు, ఆ సంగతి జి.ఎమ్. ఆఫీసుకి తెలియచెయ్యాలి. ఆఫీసర్లు కూడా టూరుకి వెళ్ళబోయే ముందూ, టూరు నుంచి తిరిగివచ్చిన తర్వాతా జి.ఎమ్. ఆఫీసులో తప్పనిసరిగా సంప్రదించాలి"

"సర్ కాపీలు..."

"సెక్షనల్ హెడ్స్‌కందరికీ మార్క్ చెయ్యి!"

వీళ్ళ మధ్య ఏదో గొడవ జరిగిందని మనసులో అనుకొంటూ స్టెనో తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"మీ మీ అధికారాలపై నా అధికారం తెలిసిందనుకుంటాను. అనవసరమైన సంభాషణలతో కాలయాపన జరిగిపోయింది. శ్రీవాత్సవ్‌జీ, మీరు ఎవరైనా జూనియర్ ఆఫీసర్‌తో, ఈ ప్రశ్నకి సమాధానం దొరికే రిపోర్టులతో పంపండి. అతనూ, నేనూ కలిసి ఏవో పాట్లుపడతాం!" సేన్‌గుప్తా మాటల్లోని నీ అవసరం లేకుండా సమాధానం తయారు చెయ్యగలమన్న వ్యంగ్యం, ఇంక కాలయాపన చెయ్యకుండా వెంటనే వెళ్ళొచ్చు అన్న ఆజ్ఞా శ్రీవాత్సవని నిరుత్తరుణ్ణి చేశాయి. పాలిపోయిన మొహంతో జి.ఎమ్. గది వదిలి బయట అడుగుపెట్టి, ఆ తర్వాత పళ్ళు కసిదీరా కొరుక్కున్నాడు.

"మీరు శ్రీవాత్సవకి బాగా అంటించారు! అతనెప్పుడూ ఓ పట్టాన తన గదిలో దొరకడు. కొన్ని విషయాల్లో అతని మూలాన చాలాజాప్యం జరుగుతోంది. నిన్న అతను శామ్సన్ ఇంజనీరింగ్ కంపెనీ డైరెక్టర్‌తో, రాత్రి పన్నెండింటి వరకూ తాజ్ హోటల్లో తాగుతూ కూర్చున్నాడు!" అన్నాడు నందకిశోర్.

"మీకెలా తెలుసు?" సేన్‌గుప్తా వెంటనే ప్రశ్నించాడు.

"నా కారు నడిపే డ్రైవరు వాగుడుకాయ. ట్రాన్స్‌పోర్టు కంట్రోల్‌రూంలో వాడు సేకరించే సమాచారం అంతా ఇంతా కాదు! శ్రీవాత్సవకి చాలా లావాదేవీలున్నాయి. బావమరిది పేర్న నాలుగు టాక్సీలు మన సంస్థకే నడుపుతున్నాడు!"

"టాక్సీలు నడుపుతున్న విషయం నాకూ చూచాయగా తెలుసు. సరే, మీరు వెంటనే పార్లమెంటు ప్రశ్నలకి సమాధానాలు రాయడం మొదలు పెట్టండి"

ఆ డి.జి.ఎమ్.లందరూ గది వదిలి వెళ్ళిన తర్వాత, సేన్‌గుప్తా శ్రీవాత్సవతో ఇంటర్నల్ ఫోనులో మాట్లాడాడు.

"మీరు శామ్సన్ ఇంజనీరింగ్ వర్క్సుకి వెళ్ళబోయేముందు నన్నోసారి కల్సుకొని, మనం ఇచ్చిన డ్రాయింగ్ వివరాలూ, వాళ్ళు చూపించిన లోపాలు నాకు వివరంగా చెప్పండి. టెండర్ ఎవార్డు చేసిన తర్వాత, ఇటువంటి లొసుగులు వస్తే అందరి తలకీ చుట్టుకొంటుంది. మీరు మరీ ఆలస్యం కాకుండా, ఆరంభంలోనే చర్య తీసుకొంటున్నందుకు

సంతోషం. కానైతే కంట్రాక్టర్లు రేపు ఎక్కువ సొమ్ము కనక అడిగితే, అంధకారంలో సమాధానాలు చెప్పేశక్తి నాకు లేదు. అందుచేత మీరు వచ్చి నన్ను 'బ్రీఫ్' చెయ్యండి. ఫైనాన్స్ డి.జి.ఎమ్.ని కూడా పిలుస్తాను"

శ్రీవాత్సవ అతి కష్టంమీద 'అలాగే' అనగల్గాడు. సేన్‌గుప్తా మరోమారు తన ఆధిపత్యాన్ని చూపించుకున్నాడు! ఆమర్నాడు శనివారం సెలవు రోజయినా, యధాప్రకారమూ సీనియర్ ఆఫీసర్సందరికీ రీజియనల్ డైరెక్టర్ రివ్యూమీటింగ్‌కి హాజరుకాకతప్పలేదు. ఈ మీటింగుల్లో సెక్షన్, డివిజన్‌హెడ్ల రంగూలూ, జట్లూ త్వరత్వరగా మారుతుంటాయి. పని సకాలంలో ఎందుకు జరగలేదని పెద్దాయన ప్రశ్నిస్తే, సమాధానం చెప్పేవాళ్ళ చూపుడువేళ్ళు ఏ వైపు తిరుగుతాయో చెప్పడం కష్టం.

ఆ రోజు మీటింగ్‌లో అయిడెంటిటీ కార్డుల విషయమై, సెక్యూరిటీవాళ్ళ జులుంపై చాలా నేరారోపణలూ, వివాదాలూ వినవలసివచ్చిన ఆర్.డి.కి తిక్కరేగి, "ఓ వారం రోజులపాటు మీ హెడ్స్ అందరూ స్వయంగా గేటుదగ్గర నిల్చుని, ఐ.డి. కార్డులు తీసుకునిరాని మీ మీ ఆఫీసర్లని గుర్తించి వెనక్కి పంపడమో, లేదా అక్కడికక్కడే మందలించి వార్నింగ్ ఇవ్వడమో చేసి, క్రమశిక్షణ తీసుకురండి. లేదా సెక్యూరిటీవాళ్ళని వాళ్ళ పని చెయ్యనివ్వండి" అని ఆదేశించి అందరి నోర్లూ నొక్కేశాడు. అనేకమైన సమస్యల్ని పరిశీలించే ఆ మీటింగయ్యేసరికి రాత్రి ఎనిమిది దాటింది.

ఆదివారం ఉదయం ఆరు గంటలకి ఇంకా సూర్యుడు లేవకముందే, సేన్‌గుప్తా ఫ్లాట్‌లో ఫోన్ మోగింది. నిద్రలోంచి ఒక్క కుదుపుతో లేచిన సేన్‌గుప్తా, ఫీల్డులో ఏం గొడవ వొచ్చిందోనని కళ్ళునులుముకొంటూ మంచంపక్క బల్ల మీద నున్న ఫోన్ అందుకొన్నాడు.

"ఉదయమే నిద్రాభంగం చేసినందుకు క్షమించండి సార్. నేను నైట్ టెలిఫోన్ ఆపరేటర్ని, కంట్రోల్‌రూం నుంచి మాట్లాడుతున్నా. మీ డివిజన్‌లో పనిచేసే ఎవరో అగర్వాల్ అనే ఆఫీసరు, పూనా వెళ్ళేదారిలో ఎక్కడో మరణించాడని, ఎవరో ఇండియన్ నేవీ నుంచి టెలిఫోన్ చేశారు. వివరాలడిగితే, పూనా నుంచి తన స్నేహితులెవరో తనకి రింగ్‌చేసి, ఈ కబురు మన సంస్థకి అందచేయమన్నారట. అంతకుమించి తనకేమి తెలియదని ఫోను పెట్టేశాడు. నేనాయన టెలిఫోన్ నెంబరూ, పేరు అడిగే అవకాశం ఇవ్వకుండా!"

"నా డివిజన్‌లోనే అని చెప్పాడా? నా పేరుకాని చెప్పాడా?"

"మీ పేరు చెప్పలేదు సార్. కెమికల్ ఇంజనీరింగ్ డివిజన్ అని చెప్పాడు. అందుకనే మీకు రింగ్ చేశాను. సర్, ఇంతకీ అగర్వాల్ అన్నతను మీ సెక్షనేనా సర్?"

"కాంటీన్‌బాయ్ నుంచి నా వరకూ ఆరు వందల మంది పన్జేస్తున్నారు. అందులో ఎంతమంది అగర్వాల్ పేరుగలవాళ్ళున్నారో ఉన్నట్టుండి ఎలా చెప్పగలను?"

"సర్, మన కంపెనీ టెలిఫోను డైరెక్టరీలో చూసేదా?" అన్నాడు ఆపరేటర్.

"అయినా అందులో టెలిఫోన్ ఉన్న వాళ్ళ పేర్లుంటాయి కాని, లేనివాళ్ళ పేర్లుండవు. కాలనీలో ఉన్నవాళ్ళకి కూడా అందరి ఇళ్ళలోనూ ఎక్స్‌టెన్షన్ ఫోనులు లేవు...."

"సర్, మీరు మాట్లాడుతూండగానే, నేను డైరెక్టరీ చూశాను. టెలిఫోను కనెక్షన్ ఉన్న అగర్వాల్‌లు ముగ్గురు మీ డివిజన్‌లో ఉన్నారు సార్. అయితే ఆ మూడూ ఎక్స్‌టెన్షన్ నెంబర్లే కాని డైరెక్టు కావు"

"గుడ్‌వర్క్. నా దగ్గర కూడా డైరెక్టరీ ఉంది. ఈ ముగ్గురి విషయమై నేను వాకబు చేస్తాను. నాకు ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ సెబాస్టియన్ నెంబర్‌కి కనెక్షన్ ఇవ్వు"

"అలాగే సర్"

టెలిఫోను ఆపరేటర్ కనెక్షన్ ఇచ్చాడు. "ఎవరూ?" అని విసుగ్గా అడిగిన సి.ఎస్.ఒ. సెబాస్టియన్, సేన్‌గుప్తా పేరు వినగానే తొట్రుపడి, "చెప్పండి గుప్తాసాబ్" అన్నాడు.

"నాకు పూర్తి వివరాలు తెలియవు కాని, మన సంస్థకి చెందిన అగర్వాల్ అనే వ్యక్తి పూనా వెళ్ళే దారిలో మరణించాడని ఓ గాలివార్త అందింది. ఎందుకైనా మంచిది మీరు పోలీస్‌స్టేషన్‌కి టెలిఫోన్ చేసి, వాళ్ళ నెట్‌వర్క్ ద్వారా పూనా, బొంబాయి రహదారి మీదనున్న పోలీస్‌స్టేషన్లని కాంటాక్ట్‌చేసి ఏదైనా సమాచారం సేకరించగలరేమోనని రిక్వెస్టు చెయ్యండి" అన్నాడు సేన్‌గుప్తా.

"ఇంతకుమించి వివరాలు లేవా?"

"గాలివార్త అని చెప్పానుగా, ఇక్కడ నేవినుంచి టెలిఫోను చేసిన వ్యక్తి కంట్రోల్‌రూం ఆపరేటర్‌కి తన వివరాలు చెప్పకుండా ఫోను పెట్టేశాడు!"

"సరేసార్. నేను ప్రయత్నించి ఏ సంగతీ మీకు తెలియజేస్తాను" అని సి.ఎస్.ఒ. ఫోన్ పెట్టేశాడు. తర్వాత సేన్‌గుప్తా తన ఎ.జి.ఎమ్ ల్నందర్ని ఒక్కొక్కర్నే నిద్రనుంచి లేవగొట్టాడు. వివరాలు చెప్పి, "మనం కంపెనీ డైరెక్టరీలో, టెలిఫోను కనెక్షన్లున్న అగర్వాల్‌లు ముగ్గురు కనబడ్డారు. వారిలో ఎవరెవరు మీకింద పన్జేస్తున్నారో తెలిసుంటే, బెదరకొట్టకుండా కాస్త లౌక్యంగా రింగ్‌చేసి కనుక్కోండి. వీళ్ళు కాకుండా మీ మీ సెక్షన్లన్లో పనిచేసే అగర్వాల్ పేరున్న ఇతర వ్యక్తుల్ని గుర్తించగలిగితే వివరాలు నాకు వెంటనే తెలియచెయ్యండి. ఈ లోపుగా నేను మన ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు గోవర్ధనరావు దేశ్‌పాండేని తీసుకుని ఆఫీసుకి వెడ్తున్నాను" అన్నాడు ఒకొక్కరితోనూ ఫోన్లో.

సేన్‌గుప్తా శ్రీవాత్సవకి కూడా టెలిఫోను చేశాడు. నందినీ శ్రీవాత్సవ ఫోన్ అందుకొని తన భర్త శుక్రవారం రాత్రి బయలుదేరి నాసిక్ వెళ్ళాడని, ఎందుకు వెళ్ళాడో, ఎక్కడ ఉంటాడో తనకి తెలియదని, ఆ రాత్రిక్కాని, సోమవారం ఉదయానిక్కాని తిరిగిరావచ్చునని చెప్పింది. శ్రీవాత్సవ తనతో కనీసం ఊరు వదిలి వెడ్తున్న సంగతి ఎందుకు చెప్పలేదా అని ఆలోచిస్తుండగా, శుక్రవారం మధ్యాహ్నం శ్రీవాత్సవ సెక్షన్ నుంచి తన దగ్గరికి

పార్లమెంటు ప్రశ్నలకి సంబంధించిన రిపోర్టులు తీసుకువచ్చిన ఆఫీసర్ పేరు 'రమేష్ అగర్వాల్' అని హఠాత్తుగా జ్ఞాపకానికి వచ్చింది. రెండు నెలల క్రితం కలకత్తానుంచి బదిలీ అయివచ్చిన అతను, తన్ను ముందుగా కలుసుకొన్నప్పుడు, వెళ్ళి శ్రీవాత్సవకి రిపోర్టు చెయ్యమనిచెప్పాడు.

ఒకవేళ అతనేమో? బాలక్రిష్ణన్‌కి ఫోన్ చేద్దామనుకొన్నాడు కాని, అతను మద్రాసు వెళ్ళిన సంగతి గుర్తుకొచ్చింది. శ్రీవాత్సవ సెక్షన్లోనే పన్జేస్తున్న సవర్కర్ నెంబరు కంపెనీ డైరెక్టరీలో చూసి, రింగ్ చేశాడు. అప్పుడే నిద్రలేచిన సవర్కర్ జి.ఎమ్. గొంతు ఫోన్లో వినగానే కాస్త కంగారుపడిపోయాడు.

"సవర్కర్, నేను జి.ఎమ్. సేన్‌గుప్తాని. మీ బాస్ శ్రీవాత్సవ నాసిక్ వెళ్ళిన సంగతి నీకు తెలుసా?"

"నాకు తెలీదుసార్. ప్లాంట్‌లో ప్రాబ్లం ఏమైనా వచ్చిందా?" ఆత్రుతగా ప్రశ్నించాడు.

"అదేమీ కాదులే. మన డివిజన్‌లో పన్జేస్తున్న ఎవరో ఒక అగర్వాల్ పూనాకి దగ్గరగా మరణించాడని ఓ గాలివార్త అందింది. మీ సెక్షన్లో కలకత్తా నుంచి వచ్చిన రమేష్ అగర్వాల్ రెండు నెలల క్రితం జాయినయ్యాడు. శుక్రవారం మధ్యాహ్నం నాకు పార్లమెంటు ప్రశ్నకి సమాధానం వ్రాయడంలో సహాయపడ్డాడు. అతనెక్కడ ఉండేది నీకు తెలుసా? అతనుకాని పూనా వెడ్తున్నట్టు మీకెవరికైనా చెప్పాడా?"

"అవును సార్, రమేష్ అగర్వాల్ మా సెక్షనే. అతను థానాలో ఎక్కడో ఉంటున్నాడని తెలుసుకాని ఎడ్రసు తెలియదు. అతనుకాని పూనా వెడ్తున్న సంగతి ఎవరికైనా చెప్పాడేమోకాని, నాకు మట్టుకు చెప్పలేదు సార్ అయినా అతనే....?"

"అయ్యుండాలని ఎక్కడా లేదు. కాని, కాకూడదని ఆశిద్దాం. వచ్చిన వార్త నిజమో కాదో తెలుసుకోకుండా కూర్చోడం భావ్యం కాదు కదా? సరే మీ సెక్షన్లోనే కాక మన డివిజన్‌లో పనిచేసే అగర్వాల్‌లు ఇంకెవరైనా నీకు తెలిస్తే, కాస్త లౌక్యంగా వాకబు చేసి నాకు ఫోను చెయ్యి"

సేన్‌గుప్తా ఆ తర్వాత ఎ.ఓ. దేశ్‌పాండేకి టెలిఫోన్ చేశాడు. ఓ గంట తర్వాత అంటే ఎనిమిదిన్నరకల్లా, దేశ్‌పాండే కంట్రోల్‌రూంకి వెళ్ళి తీసుకొచ్చిన కారులో ఇద్దరూ కలసి ఆఫీసుకి వెళ్ళారు. ఆఫీసుకి వెళ్ళగానే మళ్ళీ అందరు డి.జి.ఎమ్.లకి ఫోన్ చేశాడు. కాలనీలో టెలిఫోన్లున్న ముగ్గురు అగర్వాల్‌లూ ఒకతను ఇంట్లోనే ఉన్నట్టు, మరిద్దరు షిఫ్ట్‌డ్యూటీ మీద ప్లాంట్‌లో ఉన్నట్టు తెల్సింది. అంతకుమించి ఆ డి.జి.ఎమ్‌లు సమాచారం సేకరించలేకపోయారు. 'కొంతమంది అగర్వాల్‌లు మా సెక్షన్లో ఉన్నారని తెలిసినా, ఇళ్ళ ఎడ్రసులు తెలియవు' అని కొంతమంది చిన్నగా నసుగుడు సమాధానం చెప్పారు.

దేశ్‌పాండే, డివిజన్‌లో పనిచేసేవాళ్ళ కంప్యూటర్ జాబితా తీసుకొచ్చాడు.

"సార్, ఆఫీసర్ల హోదాలో ఎనమండుగురున్నారు. ఫోర్‌మన్, ఛార్జిమన్, టెక్నికల్

బేరర్స్ లాంటి దిగువరాంకుల్లో నలుగురున్నారు. ఇందులో ఇద్దరు ఆఫీసర్లు తప్పించి మిగిలిన వారందరూ కాలనీలోనే ఉన్నారు. టెలిఫోన్లున్న ముగ్గురూ క్షేమంగా ఉన్నారని తెలిసింది కదా. వీళ్ళ ఎడ్రసులన్నీ నా దగ్గర లిస్టులో ఉన్నాయి. కాలనీలో లేని ఇద్దరు ఆఫీసర్లు 'పార్లే'లో ఉంటున్నారు. నేను కారు తీసుకొని ఓ చుట్టు చుట్టి వచ్చేస్తాను"

"మీ లిస్టులో రమేష్ అగర్వాల్ పేరుందా?" సేన్‌గుప్తా ప్రశ్నించాడు.

దేశ్‌పాండే లిస్టు మరోసారి చూసి, "లేదుసార్, రమేష్ అగర్వాల్ వచ్చింది ఈ మధ్యనే కదా? లిస్ట్ ఇంకా అప్‌డేట్ కాలేదు" అన్నాడు కాస్త ఇబ్బందిగా.

"అతని పర్సనల్‌ఫైల్‌లో ఉండదా లోకల్ ఎడ్రసు?" సేన్‌గుప్తా ప్రశ్నించాడు.

"కలకత్తా నుంచి అతని పర్సనల్ ఫైల్ ఇంకా రాలేదు. నాకు గుర్తున్నంతవరకూ అతనికి ప్రొవిజనల్ పే ఇస్తున్నాం. అతనింకా హౌస్‌రెంట్ కోసం రశీదులూ అవీ కూడా సబ్మిట్ చేసినట్టు గుర్తులేదు. అయినా నేనోసారి కిందకి వెళ్ళి, వెరిఫైచేసి వస్తాను" అని దేశ్‌పాండే లేచేలోగా, "మే ఐ కమిన్" అంటూ సవర్కర్ లోపల ప్రవేశించాడు.

ఇద్దరికీ విష్‌చేసి అన్నాడు – "సర్ మన కాలనీలో మన డివిజన్లో పనిచేసే వాళ్ళలో ఆఫీసర్ హోదాలో ఆరుగురు అగర్వాల్‌లు ఉన్నారు. ఇద్దరు షిఫ్టు డ్యూటీలో ఉన్నారు. ముగ్గురు ఇళ్లలోనే ఉన్నారు. మిగిలిన అతను హైదరాబాద్ ట్రైనింగ్ కోర్స్‌కి వెళ్ళాడు.

"బాలక్రిష్ణన్‌సాబ్ మాసెక్షన్లో పనిచేసే అందరి ఎడ్రసులూ ఆయన బల్లమీద అద్దం కింద ఉంచుతారు. రమేష్ అగర్వాల్ థానాలో ఎక్కడ ఉండేది తెల్సింద్" – జేబులోంచి ఓ కాగితం తీసి సేన్‌గుప్తా ముందు ఉంచాడు.

"దేశ్‌పాండే, మీరు కాలనికి వెళ్ళి ఆ ఫోర్మన్, ఛార్జిమన్ లెవెల్ వాళ్ళని గురించి వాకబుచేసి, అక్కణ్ణించి పార్లేవెళ్ళి వాళ్ళిద్దరి గురించి కూడా వాకబుచేసి, అక్కణ్ణించే ముందుగా నాకు టెలిఫోను చేసి రండి. మీరు కారు తీసుకొని వెళ్ళండి.

"సవర్కర్, థానా చాలా దూరం. లోకల్‌ట్రైన్‌లో త్వరగా వెళ్ళిరావచ్చు. దేశ్‌పాండే నిన్ను కుర్లాస్టేషన్‌లో దింపి వెళ్ళిపోతాడు. థానా వెళ్ళి ఎంక్వయిరీ చేసిరా. మీ ఇద్దరి కోసం ఎదురుచూస్తూ ఇక్కడే ఉంటాను"

"అలాగే సర్" అంటూ సవర్కర్ రమేష్ అగర్వాల్ ఎడ్రస్ కాగితం తీసుకుని, దేశ్‌పాండే కంప్యూటర్ లిస్టూ తీసుకొని బయలుదేరారు. వాళ్ళిద్దరూ వెళ్ళిన మరి కొంతసేపట్లో, సి.ఎస్.ఓ. సెబాస్టియన్ ఫోను వచ్చింది. బొంబాయి, పూనా హైవేలో ఆ నాలుగైదు రోజుల్లోనూ ఏవిధమైన ప్రమాదమూ జరగలేదని. సేన్‌గుప్తా కాస్తంత కుదుటపడ్డాడు. మరోగంటన్నర దాటిన తర్వాత దేశ్‌పాండే పార్లా నుంచి టెలిఫోను చేశాడు.

"కాలనీలో ఉన్న ఫోర్‌మెన్ ఛార్జ్‌మన్ వగైరాలు క్షేమంగా ఉన్నారు. ఇద్దరు నిన్న రాత్రి షిఫ్టు చేసి వచ్చి ఇంట్లో పడుకొన్నారు. ఇద్దరు ఈ ఉదయం షిఫ్టుకి వెళ్ళారు. పార్లాలో ఉన్న ఇద్దరూ డెహ్రాడూన్ వాళ్ళు. ఒకతను ఇంటికి సెలవు మీద వెళ్ళాడు.

మరో అతను రెండు రోజుల్నుంచీ జ్వరంతో ఇంట్లో పడుకున్నాడు. నేను బయలుదేరి వస్తున్నాను"

ఇంక రమేష్ అగర్వాల్ విషయం తెలిస్తే సరిపోతుందనుకొని, సేన్‌గుప్తా, థామ్సన్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు ఫైలు అయిదోమారు చదవసాగాడు.

దేశ్‌పాండే తిరిగివచ్చిన మరో రెండు గంటలకి, సవర్కర్ పాలిపోయిన ముఖంతో తిరిగివచ్చాడు. సేన్‌గుప్తా వెంటనే కీడుని శంకించాడు. సవర్కర్ మరో కుర్చీలో కూర్చుని, కర్చీఫ్ తీసుకొని మొహం తుడుచుకొని, నెమ్మదిగా చెప్పాడు.

"సర్, రమేష్ అగర్వాల్ అద్దెకుంటున్న ఫ్లాట్ తాళంవేసి ఉంది. పక్క ఫ్లాట్ బెల్‌కొడితే, వాళ్ళు తలుపు తీశారు. అతని పేరు ముత్తుస్వామి, మన సంస్థలోనే సెంట్రల్‌ఫైనాన్స్‌లో పన్జేస్తున్నాడు. నేను విషయం చెప్పాను. ముత్తుస్వామి భార్య నెత్తీనోరూ బాదుకోసాగింది. జరిగిందేమిటంటే- రమేష్ అగర్వాల్ అన్నగారూ, వదినా ఇద్దరూ డాక్టర్లే. అన్నగారు పూనా ఆర్మీ మెడికల్ హాస్పిటల్లో పన్జేస్తున్నాడు. నిన్న ఉదయం రమేష్ అగర్వాల్ అతని భార్యా బయలుదేరి బస్సులో పూనా వెళ్ళారట. అగర్వాల్ భార్య తాళం ముత్తుస్వామి భార్యకిచ్చి, పనిమనిషిచేత అంట్లుతోమించి, ఇల్లు తుడిపించమని చెప్పిందట. అతని అన్నగారి ఎడ్రసు వివరాలడిగితే తెలియవన్నారు. నేనూ, ముత్తుస్వామి అతని ఫ్లాట్ తాళం తీసి లోపలికి వెళ్ళాం. ముందు హాల్లో బల్ల మీద ఐ.డి. కార్డూ,పక్కనే మన సంస్థ డైరీ ఉన్నాయి. డైరీలో అడ్రసులేమైనా ఉన్నాయాని చూశాను, డాక్టర్ నిశాంత్ అగర్వాల్, ఆర్మీ మెడికల్ కాలేజి, రెసిడెంట్ హాస్టల్ రూం.నెం.42 అనే ఓ అడ్రసు కనబడింది నోట్ చేసుకొని తీసుకువచ్చాను"

"నీ గదిలో ఉన్న రెండు వాల్యూములూ బొంబాయి డైరెక్టరీనే. మహారాష్ట్రా డైరెక్టరీ ఆఫీసులో ఉందా?" సేన్‌గుప్తా దేశ్‌పాండేని ప్రశ్నించాడు.

దేశ్‌పాండే రెండో అంతస్థులో ఉన్న తన ఆఫీసుకెళ్ళి మహారాష్ట్ర టెలిఫోన్ డైరెక్టరీతో తిరిగొచ్చాడు. సేన్‌గుప్తా తన ముందునున్న టెలిఫోన్ దేశ్‌పాండే ముందుకు తోశాడు.

...నిశాంత్ అగర్వాలా?... ఏ యూనిట్‌లో పన్జేస్తున్నాడు?..... రెసిడెంట్ హాస్టల్సు నాలుగున్నాయి! ఏది?..... సెంట్రల్ ఎంక్వయిరీని కాంటాక్ట్ చెయ్యండి.. ప్రొఫెసర్ కులకర్ణి న్యూరాలజీ డిపార్ట్‌మెంట్‌ని అడగండి. ఆయన చెప్పగలడేమో?... నా దగ్గర ఆర్నెల్లు పనిచేసిన తర్వాత అతన్ని ప్రొఫెసర్ జిలానీ కిందకి మర్చారు.... జిలానీ ఇవ్వాళ ఆస్పత్రికి రాలేదు... నిశాంత్ అగర్వాలా? బి.వింగ్ వార్డు పదిహేడు అడగండి..

అంచెలంచెలుగా పట్టువదలని విక్రమార్కుడిలా దేశ్‌పాండే చేసిన ప్రయత్నాలు, బి.వింగ్ పదిహేడో వార్డు దగ్గర ఫలించాయి. దేశ్‌పాండే వివరాలు చెప్పాడు.

"మీరు విన్న మాట నిజమే. కాని డాక్టర్ నిశాంత్ అగర్వాల్ పేరుకి రెసిడెంట్ హాస్టల్ నెంబరు త్రీలో రూం ఉంచుకొన్నాడు కాని, అతను వేరే ఇల్లు అద్దెకు తీసుకొని దగ్గర్లోనే

ఉంటున్నాడు. ఇంటి యజమాని టెలిఫోను నెంబరు నోట్ చేసుకోండి.. ఎడ్రసు.. మీకు దుర్వార్త చెప్పినందుకు సారీ!.... ఏదైనా అవసరంవస్తే మళ్ళా రింగ్ చెయ్యండి"

దేశ్‌పాండే రెండు ప్రయత్నాలు చేసిన తర్వాత, నిశాంత్ అగర్వాల్ ఇంటి యజమాని నెంబరు దొరికింది. ఇంటావిడ వెళ్ళి, నిశాంత్‌ని పిల్చుకువచ్చింది.

"హల్లో, డాక్టర్ నిశాంత్ స్పీకింగ్"

దేశ్‌పాండే టెలిఫోను రిసీవర్ని సేన్‌గుప్తాకి యిచ్చాడు.

"హల్లో నాపేరు సేన్‌గుప్తా.. ...సంస్థలో కెమికల్ ఇంజనీరింగ్ డివిజన్ జనరల్ మేనేజర్ని. ఈ ఉదయం పూర్తివివరాలు తెలియని ఓ గాలివార్త అందింది. నేను విన్న వార్త కనక నిజమే అయితే మీ తమ్ముడు..?" సేన్‌గుప్తా అర్ధాంతరంగా ఆపేశాడు.

"అవున్సార్, మీరు విన్నది నిజమే. నేనూ, మా తమ్ముడూ కలిసి రెండు సంవత్సరాలకి పైగా అయింది. కలకత్తా నుంచి బొంబాయికి మాకు దగ్గర్లో వచ్చేశారు కదా, ఓ శని, ఆదివారాలు ఇక్కడికి రండి, సరదాగా గడపవచ్చునని ఉత్తరం రాశాను. నిన్న ఉదయం పదకొండింటికి ఇక్కడికి బస్సులో వచ్చారు.

"నిన్న రాత్రి ఎనిమిది గంటలకు పూనా పొలిమేర్లలోని ఓ రిసార్ట్ హోటల్లో మేమందరమూ డిన్నర్ చేస్తోంటే, రమేష్‌కి హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. మా తమ్ముడూ మరదలూ తప్ప ఆ గుంపులో ఉన్న మిగిలిన నలుగురూ డాక్టర్లమే. అయినా ఏమీ చెయ్యలేకపోయాం. దగ్గర్లో ఉన్న హాస్పిటల్‌కి తీసుకువెళ్ళేసరికే చెయ్యిజారిపోయాడు!"

"మీకు, రమేష్ భార్యకీ యితర కుటుంబ సభ్యులకీ మా ఆఫీసు తరపున, నా తరపున సానుభూతి తెలియజేస్తున్నాను. మీరు తీరని దుఃఖంలో ఉన్నా, ఓ విషయం అడగక తప్పటల్లేదు. మా సంస్థ కంట్రోల్‌రూమ్‌కి ఈ ఉదయం ఆరు గంటలకి ఎవరో బొంబాయి నేవీ నుంచి, రమేష్ అగర్వాల్ అని పూర్తి పేరు చెప్పకుండా, ఎవరో అగర్వాల్ అన్నతను పూనా పరిసరాల్లో మరణించాడన్న వార్త చెప్పారు. అగర్వాల్ నామధేయాలున్న అందరి గురించి వాకబుచేస్తూ, చివరికీ దుర్వార్త వినవలసివచ్చింది. ఆ నేవీ ఆయన కెవరు కబురుచేశారు? ఆయనకి పూర్తి వివరాలు ఇవ్వలేదా?"

"సార్ మీ బాధ నేనర్థంచేసుకోగలను. మా తమ్ముడు కెమికల్ ఇంజనీరింగ్ డివిజన్‌లో పన్జేస్తున్నాడని తప్ప ఇతర సెక్షన్ వివరాలూ అవీ తెలియవు. మా మరదలికి ట్రాంక్విలైజర్స్ ఇచ్చి పడుకోబెట్టాం. ఆమె మాట్లాడేపరిస్థితిలో లేదు. వాడి బ్రీఫ్‌కేస్ తీసి చూశాను, డైరీ కోసం, టెలిఫోను నెంబర్ల కోసం. వాడు డైరీ తీసుకురాలేదు. చివరికి నా స్నేహితుణ్ణి మా ఇంటి యజమాని టెలిఫోను దగ్గర కూర్చోబెట్టాను బొంబాయి ఎలాగైనా కబురంపమని. అతను, అతని భార్య కజిన్ నేవీలో పన్జేస్తున్నతనికి టెలిఫోను చేశాడు, నిన్న రాత్రి రెండు గంటల ప్రాంతంలో. ఆయన నిద్రమత్తులో సరిగా వినకపోయి ఉండొచ్చు. అందుకనే పూర్తిపేరు చెప్పలేకపోయాడేమో. కాని ఇక్కణ్ణించి మా స్నేహితుడు, ఇంటి యజమాని

టెలిఫోను నెంబర్ తెలియజేసివుంటే, మీకు ఇబ్బంది కలగకపోయేది" - నిశాంత్ నొచ్చుకుంటూ అన్నాడు.

"కాళ్ళూ చేతులూ ఆడని పరిస్థితుల్లో నేనూ అన్నివివరాలూ చెప్పలేకపోయేవాణ్ణి. ఏ అగర్వాలో, అసలు వార్త నిజమో కాదో, అన్న ఆందోళనతో ఉదయం నుంచీ సతమత మవుతున్న నేను, మిమ్మల్ని అడగకూడదనుకొంటూనే అడిగేశాను. ఏమీ అనుకోవద్దు. మరి క్రిమేషన్..?"

"మా తల్లిదండ్రులు ఈ ఉదయమే మీరట్ నుంచి బయలుదేరగలిగారు. వాళ్ళు వచ్చేసరికి రేపు మధ్యాహ్నం దాటుతుంది. అన్నీ వాళ్ళు వచ్చిన తర్వాతే"

"మా ఆఫీసు తరపున ఎవర్నైనా పంపిస్తాను. వచ్చేసరికి రెండుకావచ్చు. మీకే సహాయం కావల్సినా అడగండి"

"మీరు తీసుకొంటున్న శ్రమకి, థాంక్స్!"

సేన్‌గుప్తా మరి మాట్లాడకుండా ఫోన్‌పెట్టి, వెంటనే రీజియనల్ డైరెక్టరింటికి ఫోనుచేసి, ఉదయం నుంచీ జరిగిన హైటెన్షన్ డ్రామాని గురించి చెప్పి, పూనా ఇద్దరు ఆఫీసర్లని కంపెనీ కారులో పంపేందుకు పర్మిషన్ తీసుకొన్నాడు.

పర్మిషన్ యిచ్చి ఆర్.డి. ఓ. మాట అన్నాడు.

"రమేష్ అగర్వాల్ స్టేషన్ లీవ్ పర్మిషన్ తీసుకొన్నాడో లేదో చూడండి. తీసుకోని పక్షంలో అతని ఆత్మ మీద మనం ఏమీ చర్య తీసుకోలేం! కాని ఈ కథనం చెప్పి మీ డివిజన్ వాళ్ళనందర్నీ ఓ ఝాడింపు ఝాడించండి. స్ట్రేటజీ కోసం రివ్యూ మీటింగ్‌లో మిమ్మల్నందర్నీ నేనూ ఓ కుదుపు కుదుపుతాను! మీరేమీ అనుకోవద్దు!"

సేన్‌గుప్తా చిన్నగా నవ్వుకొంటూ ఫోను పెట్టేశాడు.

"ఆర్.డి. ఇద్దర్నీ ఆఫీసుకారులో పూనా వెళ్ళడానికి అనుమతి ఇచ్చాడు. దేశ్‌పాండే, మీరిప్పుడే అతనికివ్వవలసిన బెనొవొలెంట్ ఫండ్ కోసం నోట్ పుటప్ చెయ్యండి. నేను శాంక్షన్ చేసేస్తాను. మీరిద్దరూ రేపు ఆఫీసుకివచ్చి కాష్ డ్రాచేసి, వెంటనే ఇక్కణ్ణుంచే పూనా బయలుదేరితే రెండింటికల్లా అక్కడకు చేరుకొంటారు. మీరిద్దరూ ఈ రోజల్లా నాకు సహాయపడినందుకు చాలా చాలా థాంక్స్"

వాళ్ళిద్దరూ అలాగేనంటూ తలలూపారు.

✿ ✿ ✿

శ్రీవాత్సవ నాసిక్ నుంచి ఆదివారం రాత్రి రాలేక, ఉదయం బస్సులో బయలుదేరి బొంబాయి చేరుకొనేసరికి పన్నెండు దాటింది. ఇల్లు చేరేసరికి తాళం వేసి ఉంది. అతని శ్రీమతి మధ్యాహ్నం పెత్తనాలకి వెళ్ళింది. తన దగ్గరున్న తాళంతో తలుపు తెరుచుకొని, స్నానంచేసి, బట్టలు మార్చుకొని, ఆ తర్వాత ట్రాన్స్‌పోర్ట్ కంట్రోల్ రూమ్‌కి ఫోనుచేసి, కారు తెప్పించుకొని ఆఫీసు చేరేసరికి ఒంటిగంట దాటింది.

"సార్, జి.ఎమ్. సాయంత్రం నాలుగింటికి కాన్ఫరెన్స్ హాల్లో మీటింగ్ ఏర్పాటు చేశారు. మీకు చెప్పమన్నారు" అంది స్టెనో.

"దేన్నిగురించి?"

"కలకత్తా నుంచి బదిలీఅయి వచ్చి మన సెక్షన్లో జాయినయిన రమేష్ అగర్వాల్ అన్నతను గుండెపోటుతో మరణించాడు. సంతాపసభ అనుకొంటాను"

"అలానా పాపం! సవర్కర్‌ని పిలు"

"ఆయన్ని జి.ఎమ్. పూనా పంపించారు సార్!"

"నన్నడగవల్సిన అవసరం లేదా? జి.ఎమ్.తో తాడోపేడో తేల్చుకోవాలి! ఇంతకీ ఏపనిమీద పంపించాడట?"

"రమేష్ అగర్వాల్ మరణించింది పూనాలో, అసలు జి.ఎమ్. గారు మిమ్మల్ని పూనా వెళ్ళమని చెప్పడానికి ఫోను చేశారు. కాని మీరప్పటికింకా రాకపోవడంతో, వెంటనే సవర్కర్‌ని పంపడానికి నిశ్చయించారు!" స్టెనో నసుగుతూ అన్న మాటలు, సేన్‌గుప్తా పరోక్షంగా వేస్తున్న చివాట్లనిపించాయి శ్రీవాత్సవకి. 'ఛ!ఛ! నిన్న రాత్రే తిరిగివచ్చుంటే బావుండేది?' అనుకొన్నాడు మనసులో.

నాలుగ్గంటల మీటింగ్‌కి కాన్ఫరెన్స్‌హాలు కిటకిటలాడుతోంది. జి.ఎమ్. హాల్లో అడుగు పెట్టగానే అందరూ ఓసారి లేచికూర్చున్నారు. కలకలం సద్దుమణిగింది. సేన్‌గుప్తా హాలంత టినీ ఓసారి కలయజూశాడు. తన దృష్టిని తప్పించుకొంటూ దూరంగా కూర్చుని ఎటో చూస్తున్న శ్రీవాత్సవని చూసి చిన్నగా నవ్వుకొన్నాడు. సేన్‌గుప్తా గొంతు సవరించు కొన్నాడు.

"కొన్ని విద్రోహశక్తులు మన ప్లాంట్‌ని దెబ్బతీయడానికి చూస్తున్నాయన్న రహస్య సమాచారం అంది, సెక్యూరిటీ ఏర్పాట్లని కట్టుదిట్టం చేయవలసివచ్చింది. వందలాది ఉద్యోగుల్ని జ్ఞాపకం పెట్టుకోవడం సెక్యూరిటీకి సాధ్యం కాదు. వాళ్ళు చెయ్యగల్గిందీ, చెయ్యవల్సింది అయిడెంటిటీ కార్డుని పరిశీలించడమే. ఇందుకు సీనియర్లతో సహాకొంత మంది ఆఫీసర్లు అలజడి లేవదీశారు. సెక్యూరిటీ గార్డులకి ఐ.డి. కార్డులు చూపించడం అవమానకరంగా ఉంటే, సెక్షన్‌హెడ్లని గేటుదగ్గర నిల్చోమని మొన్న శనివారం మీటింగ్‌లో ఆర్.డి. ఆదేశించాడు. మీకందరికీ విషయం అర్థమైందనుకొంటాను. రేపట్నుంచి అందరూ ఆఫీసులో కాని, ప్లాంట్‌లో కాని ప్రవేశించబోయే ముందు ఏం చెయ్యాలి..?"

"ఐ.డి. కార్డు చొక్కా జేబులకి తగిలించుకొని 'డిస్‌ప్లే' చెయ్యాలి!" కుర్ర ఆఫీసర్లు ఏకకంఠంతో అన్నారు.

"స్పోర్టివ్‌నెస్ అంటే అలాగుండాలి! మరోవిషయం. ఆఫీసరనేవాడు అన్నివేళలా అందుబాటులో ఉండాలి. స్వంతపనిమీదకాని, ఆఫీసుపనిమీదకాని ఆఫీసు వదిలి బయటకు వెళ్ళేటప్పుడు, మీ బాస్‌లకి కాని, లేదా బాధ్యతాయుతమైనా తోటి ఆఫీసర్లకి కాని చెప్పి వెళ్ళండి. ఇక్కడ మాకు మీ అవసరం కనక వస్తే కనీసం ఎక్కడికి పరుగెత్తాలో తెలుస్తుంది.

"సెలవు రోజుల్లోనయినా, సెలవు పెట్టిన రోజుల్లోనైనా ఊరు వదిలి వెళ్ళేటప్పుడు మీరు రూల్సు ప్రకారం 'స్టేషన్‌లివ్ పర్మిషన్' తీసుకోవాలి. కాని ఈ అలవాటునెవరూ పాటిస్తున్నట్టు కనిపించటల్లేదు.

"నిన్న ఉదయం మన ఆఫీసుకి చెందిన అగర్వాల్ అనే ఆఫీసరు పూనా వెళ్ళే దారిలో ఎక్కడో మరణించాడని ఓ గాలివార్త అందింది. అయితే అతనే అగర్వాలో అని తెలియడానికి నిన్న మాకు ఓ రోజల్లా పట్టింది. అతని పేరు రమేష్ అగర్వాల్. కెమికల్ ఇంజనీరు. సెలవు రోజులే కదా అని ఎవరకీ చెప్పాపెట్టకుండా పూనా అన్నగారి వద్దకు వెళ్ళి శనివారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. ఆ అన్నగారు కూడా తన తమ్ముడు ఏ సెక్షన్‌లో పన్జేస్తున్నదీ అన్న వివరాలు తెలియక, ఎవరో స్నేహితుల ద్వారా ఫోన్ చేయించాడు. డైరెక్ట్ కంటాక్ట్ లేకపోవడం మూలాన వార్త సంపూర్ణంగా అందలేదు. రమేష్ అగర్వాల్ తన ఐ.డి. కార్డునికాని, మన సంస్థ డైరీని కాని కూడా తీసుకుపోలేదు!

"గుడ్డికన్న మెల్ల నయం అన్నట్టుగా రమేష్ అగర్వాల్ వాళ్ళ అన్నగారి దగ్గర మరణించాడు. అదేకనక దారిలో ఏదైన ప్రమాదం కనక సంభవించివుంటే, అయినవాళ్ళకీ, ఆఫీసువాళ్ళకీ తెలియడానికి ఎన్నిరోజులు పట్టేదో? మీ అందరికీ నేను ఇచ్చే సలహా ఏమిటంటే ఇల్లు వదిలివెళ్ళినప్పుడు అయినవాళ్ళకీ, ఆఫీసు వదిలి వెళ్ళేటప్పుడు అధికారులకీ చెప్పి వెళ్ళండి. అయిడెంటిటీ కార్డులు ఎప్పుడూ దగ్గర ఉంచుకోండి.

"ఒక వ్యక్తి మరణాన్ని ఆసరాగా తీసుకొని మీ కందరికీ ఈ మాటలు చెప్పవలసినందుకు చింతిస్తున్నాను. ఈ విధంగానైనా మన కళ్ళు తెరిపించిన రమేష్ అగర్వాల్ ఆత్మ శాంతికి రెండు నిముషాలు మౌనం పాటిద్దాం"

ఆ తర్వాత మరెవరూ మాట్లాడ్డానికి వీల్లేకుండా, మీటింగ్ మౌనంగా ముగిసింది. ✿

✿ ✿ ✿

**ఉపసంహారం :**

*"నందినీ" శ్రీవాత్సవ ఫోనులో అన్నాడు.*

*"చెప్పండి"*

*"ఈ సాయంత్రం సెంటార్ హోటల్లో పార్టీ వుంది. ఆఫీసయిన తర్వాత అక్కణ్ణించే అలా హోటలుకి వెళ్తున్నాను. రాత్రి వచ్చేసరికి ఆలస్యమవుతుంది"*

*ఎప్పుడూ లేంది భర్త ఇవ్వాళ ఎందుకు చెబ్తున్నాడో అని ఆశ్చర్యపడుతూ నందినీ శ్రీవాత్సవ అప్రయత్నంగా అంది - "అంటే డిశంబరు గొడవల్లో బాంబు పేలిన హోటలేనా? ఎందుకండీ బాబూ, అటువంటి హోటళ్ళలో పార్టీలకి వెళ్ళడం?"*

*.... బయటకు వెళ్తున్నప్పుడు 'ఎక్కడికి వెళ్తున్నావు?' అని, అయినవారడిగే మాటలవెనుక భయం శ్రీవాత్సవకిప్పుడు పూర్తిగా అర్థమైంది.*

*(స్వాతి మాసపత్రిక :: మే, 2001)*